సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్



లింగంపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

కాచిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ పార్టీ అలవోకగా గెలుస్తుందని, ప్రజలు ఎక్కడ చూసినా బ్రహ్మరథం పడుతున్నారని అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ లింగంపల్లి, బాలప్పబాడ తదితర ప్రాంతాల్లో స్థానిక బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంబర్‌పేటలో తాను చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసునని, తప్పకుండా రెండోసారి అసెంబ్లీకి పంపడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బీఆర్‌ఎస్‌పై అభిమానం చూపుతున్నారన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ.. ప్రజాసేవకే తన జీవితం అంకితం చేశానన్నారు. కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బాబు, శ్రీశైలం, శాంతి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యం

నల్లకుంట: అభివృద్ధి, ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమని బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ తనయుడు కాలేరు మణికంఠ అన్నారు. శుక్రవారం ఆయన కాలేరు వెంకటేష్‌కు మద్దతుగా నల్లకుంట డివిజన్ పరిధిలోని శివానంద్‌నగర్, రత్నానగర్, సత్యానగర్‌లో కాలేరు మణికంఠ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. వృద్ధులను కలిసి ఆయన ఆసరా పింఛన్లు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కారు గుర్తుపై ఓటేసి నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన కాలేరు వెంకటేష్‌ను గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నాయకులు భాస్కర్ గౌడ్, దూసరి వంకట్ గౌడ్, సతీష్ చంద్ర గౌడ్, రాము యాదవ్, క్రిసోలైట్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అండగా ఉంటాం

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ పేదలకు అండగా అండగా ఉంటారని అతని సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ అన్నారు. శుక్రవారం ఆమె గోల్నాక డివిజన్‌లో స్థానిక బీఆర్‌ఎస్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతు కాలేరు వెంకటేష్‌ను గెలిపిస్తే ఇంటి మనిషిగా అందరి సంక్షేమాన్ని కోరుతారని ఆమె ఓటర్లకు వివరిస్తూ ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా కాలేరు వెంకటేష్ చేసిన అభివృద్ధికి ఓటు వేయాలని కోరారు.



రత్నానగర్‌లో ప్రచారం చేస్తున్న కాలేరు మణికంఠ

అంబర్‌పేటలో అమిత్‌షా రోడ్ షో

బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్‌షోలలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

–సాక్షి, సిటీబ్యూరో





హాట్..హాట్‌గా..

- జోరుగా ప్రచార పర్వం
- సోషల్ మీడియా వేదికగా విమర్శలు
- స్థానిక వాట్సాప్ గ్రూప్‌లలో పరస్పర ఆరోపణలు
- రోడ్‌షోలు, బైక్ ర్యాలీలతో హోరెత్తిన ప్రచారం

అంబర్‌పేట: ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పోలింగ్ తేది సమీపిస్తున్న కొద్దీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రచార శైలి రోజుకు కొత్త పుంతలు తొక్కుతోంది. రోడ్‌షోలు, బైకు ర్యాలీలు, జాతీయ నేతలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఒకరిపై ఒకరు విమర్శలకు పదును పెడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రలు సంధించుకుంటున్నారు. ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. ఇన్నాళ్లు గల్లీల్లో చేసిన ప్రచారం కాస్తా రోజుకో మలుపు తిప్పుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పట్టు నిలుపుకునేందుకు బీఆర్‌ఎస్...

సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ పట్టు నిలుపుకునేందుకు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచారంలో ముందునుంచి ఆయన ముందు వరుసలో ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు నాలుగు సార్లకు పైగా ప్రచారాన్ని పూర్తి చేశారు. ఏ ఓటర్‌ను వదలకుండా మద్దతు కోరారు. ఐదేళ్లుగా స్థానికంగా నిత్యం అందుబాటులో ఉండి కుల, వృత్తి సంఘాలు, బస్తీ సంఘాలు, కాలనీ ఆసోసియేషన్లతో సంబంధాలను పదిలపరుచుకున్నారు. దీంతో పార్టీ శ్రేణులతో పాటు స్వచ్ఛందంగా పలు సంఘాలు బీఆర్‌ఎస్ అభ్యర్థి కోసం ప్రచారంలోకి దిగాయి. దీంతో ఆయన గెలుపుపై ధీమాగా ఉన్నారు.

అనుకూల పవనాలపై కాంగ్రెస్ ఆశలు..

కాంగ్రెస్ అభ్యర్థి రోహిన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. రాగానే నియోజకవర్గంలో ఉన్న క్రియాశీల నేతలను తనవైపు తిప్పుకుని కొంత సఫలీకృతం అయ్యారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రచార వనరులను సమాకుర్చుకుని నియోజకవర్గాన్ని చుట్టేశారు. తన పరిచయాలను వినియోగించుకొని గెలుపుపై ధీమా పెంచుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అనుకూల పవనాలు వీస్తున్నాయి అంటూ ప్రచారాన్ని తమ అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఉన్న కొద్ది రోజులను మరింతగా వినియోగించుకొని గట్టెక్కాలని ప్రయత్నిస్తున్నారు.

కేడర్‌పైనే బీజేపీ నమ్మకం..

అంబర్‌పేట నియోజకవర్గం గతంలో బీజేపీకి కంచుకోటగా ఉండేది. పార్టీ కేడర్ సహితం చిత్తశుద్ధితో పనిచేస్తారని నమ్మకంతో పార్టీ అభ్యర్థి కృష్ణయాదవ్ తన ప్రచారాన్ని సాగిస్తున్నారు. పాదయాత్రలతో పాటు రోడ్‌షోలతో ప్రచార పర్వంలో వేగం పెంచారు. తన అనుభవాన్ని వినియోగిస్తూ ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆయనకు మద్దతుగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, అమిత్‌షాలు రోడ్ షోలు నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు

కాచిగూడ: కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నేత, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన కాచిగూడ డివిజన్ కుద్బిగూడ, చెప్పల్‌బజార్, చర్చిలేన్ తదితరర ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి బీఆర్‌ఎస్ పార్టీని సాగనంపాలన్నారు. కాంగ్రెస్ గెలుపుతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని, ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో దేవి రెడ్డి విజితారెడ్డి, అభిషేక్ యాదవ్, తోట జగన్నాథం, అనిత తదితరులు పాల్గొన్నారు.



కుద్బిగూడలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేత దిడ్డి రాంబాబు

ఎస్సీ వర్గీకరణపై చట్టం చేయాలి

మాదిగ మేధావుల ఫోరం డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్ర: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి వెంటనే అమలు చేయాలని మాదిగల మేధావుల ఫోరం డిమాండ్ చేసింది. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పరిష్కారం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదిగ దండోరా ఉద్యమం ఎవరో ఒకరి ఉద్యమం కాదని ప్రతి మాదిగ, మాదిగ ఉపకులాలు చేసిన ఉద్యమం అన్నారు. 30 ఏళ్లుగా ఎందరో తమ జీవితాలను ఫణంగా పెట్టారన్నారు. ఉద్యమాన్ని ఒక పార్టీకి తాకట్టు పెట్టడం అంటే మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. మోదీ వర్గీకరణ కోసం కమిటీ వేస్తాననడం మరోసారి మాదిగలను మోసం చేసేందుకేనని ఆరోపించారు. పదేళ్లుగా అధికారంలో ఉంటూ అనేక చట్టాలను రాత్రికి రాత్రే చేసిన మోదీ ఎస్సీ వర్గీకరణ చేయలేదా అని ప్రశ్నించారు. వర్గీకరణ సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవాన్ని మందకృష్ణ మాదిగ బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశం మాదిగలదా లేదా మోదీదా అని ప్రశ్నించారు. మందకృష్ణ మీటింగ్‌కు బీజేపీ కార్యకర్తలే ఎక్కువ వచ్చారని ఎద్దేవా చేశారు. ఎమ్మార్పీఎస్‌ను భీ కొట్టే పరిస్థితిని తీసుకు రావద్దని హితవుపలికారు. మందకృష్ణను ప్రశ్నించకపోతే హోల్‌సెల్‌గా మాదిగలను అమ్మేస్తాడని, మోదీని తిడితే మందకృష్ణకు ఎందుకు బాధకలుగుతుందో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో పల్లెల వీరస్వామి, నతానియేల్, ప్రొఫెసర్ ఈటికాల పురుషోత్తం, ప్రొఫెసర్ దయాకర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, బాబురావు, రాగాల నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హైకోర్టు మాజీ న్యాయమూర్తులకు సన్మానం

కాచిగూడ: జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 25న బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ హాల్‌లో హైకోర్టులో పదవీ విరమణ చేసిన ప్రముఖ న్యాయమూర్తులు జస్టిస్ వామన్‌రావు, జస్టిస్ జి.చంద్రయ్య, జస్టిస్ యం.వెంకటేశ్వర్ రెడ్డి, జస్టిస్ పిఎస్ నారాయణ, జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డిలకు అభినందన సత్కార సభను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



కవాడిగూడ: బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర నాయకులు చెల్లిమల్ల సునీల్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం. అంజన్‌కుమార్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఇందిరాపార్కు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... 2007లో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆహ్వానం మేరకు పార్టీలో సామాన్య కార్యకర్తగా చేరి పార్టీ పటిష్టత కోసం కృషి చేశానన్నారు. 2012 ఎస్సీ ,ఎస్టీ సబ్‌ప్లాన్‌కోసం ఇందిరాపార్కు వద్ద కూడా నిరాహార దీక్ష చేపట్టారు. రెండు పర్యాయాలు చొప్పదండి నుంచి బీజేపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నా పార్టీ పెద్దలు పట్టించుకోలేదన్నారు. బీజేపీ నేతల వైఖరికి నిరసనగా పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాంనగర్ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్ సమక్షంలో పార్టీలో చేరినట్లు ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని చెలిమల్ల సునీల్ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



అంబర్‌పేట: ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ అన్నారు. శుక్రవారం ఆయన బర్కత్‌పురలోని రెడ్డి ఉమెన్స్ కళాశాలలో అంబర్‌పేట నియోజకవర్గం ఈవీఎం యంత్రాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఉన్నతాధికారులు, ఆర్‌వో అపర్ణ, ఈఆర్‌వో మారుతీ దివాకర్, భిక్షపతిలతో కలిసి ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

71 శాతం మందికి ఓటరు స్లిప్‌ల పంపిణీ

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని 3,01,788 ఓటర్లకు గాను ఇప్పటి వరకు 71 శాతం ఓటర్లకు(2,14,270) ఓటరు స్లిప్‌లను అందజేసినట్లు ముషీరాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఓటరు స్లిప్‌లను అందని పక్షంలో సంబంధిత బీఎల్‌వో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రిటర్నింగ్ అధికారిని గాని సంప్రదించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు ముషీరాబాద్ నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలి

ముషీరాబాద్: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తల్లిదండ్రులు, బంధువులు ఓటింగ్‌లో పాల్గొనేలా విద్యార్థులకు వారికి అవగాహన కల్పించాలని సామాజికవేత్త జి.శ్రీనునాయుడు అన్నారు. శుక్రవారం ఇందిరా హైస్కూల్‌లో ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొంటేనే నిజమైన ప్రజా సేవలకులు గెలిచి పాలన అందిస్తారన్నారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు, స్నేహితులకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు తెలంగాణ ఉద్యమకారుడి రాజీనామా



మాట్లాడుతున్న తట్ట సుధాకర్

నల్లకుంట: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు తట్ట సుధాకర్ పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. శుక్రవారం నల్లకుంట టీఆర్టీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి ఆయన మాట్లాడారు. తాను ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా 2001 నుంచి పార్టీ పటిష్టత కోసం కృషి చేశానన్నారు. నేడు పార్టీలో ఉద్యమకారులకు గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పెట్టుబడి దారులు, ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికి పెద్ద పీటవేస్తూ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ అవమాన భారాన్ని తట్టుకోలేక సురులతో కలిసి పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. త్వరలో 300 మందితో ఓ జాతీయ పార్టీలో చేరనున్నట్లు ఆయన తెలిపారు. ఇంతకాలం పార్టీలో సహాయ సహకారాలు అందజేసిన సన్నిహితులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వీరభద్ర స్వామి, ఆదినారాయణ, ఎం. శ్రీనివాస్, రజనీశ్ రాహుల్, సాయికుమార్, మోతీలాల్, బన్నీ, రంజన్, సతీష్, కిరణ్ కుమార్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆర్.వెంకట్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్ర: రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నెట్‌వర్క్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ (ఎన్‌పీసీఆర్) ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, సమస్యలు, సవాళ్లు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం వల్ల వచ్చే రూ.35 వేల కోట్ల కోసం ప్రభుత్వాలు ప్రజలను అంధకారంలోకి నెట్టి వేస్తున్నాయన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా మద్యం మీద ఆధారపడుతూ పేద ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పిల్లల భవిష్యత్తును కాలరాస్తున్నారని బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చట్టబద్ధ బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్‌పీసీఆర్ కన్వీనర్ నాగరాజు, సాధన సంస్థ ప్రతినిధి మురళీ, ఎస్ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అమన్ వేదిక ప్రతినిధి అంబిక తదితరులు పాల్గొన్నారు.

పలికే వాడు కావాలా.? పాతబస్తీ నేత కావాలా..?

● లబ్ధిదారులే గెలిపిస్తారు ● ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



రాంనగర్ చౌరస్తాలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ముఠా గోపాల్

ముషీరాబాద్: నీ ఇంటి పక్కనే ఉండే ముఠా గోపాల్ కావాలో... పాత బస్తీ వ్యక్తి కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ముషీరాబాద్ నియోజకవర్గంలో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న తనను మరోసారి గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన రాంనగర్ చౌరస్తా నుంచి సాగర్ లాల్ ఆసుపత్రి వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో తాను చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదం చేస్తాయన్నారు. పిలిస్తే పలికే వ్యక్తినని, మీకు ఆపద వస్తే ఐదు నిమిషాల్లో మీ ఇంటి వద్ద ఉంటానని ఇప్పుడు ఓట్లు అడుగుతున్న పార్టీల అభ్యర్థులు ఉంటారా అని ఆయన ప్రశ్నించారు. తాను పక్కా లోకల్ అని లోకల్‌కు నాన్ లోకల్‌కు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో తన విజయం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన తన ప్రత్యర్థులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్ కుమార్‌యాదవ్ పోటీ చేయకుండా మొహం చాటేశారని ప్రస్తుత ఎన్నికల్లోనే ఇదే పునరావృతం అవుతుందని జోష్యం చెప్పారు. ఏ వ్యక్తి అయినా తనతో స్వేచ్ఛగా మాట్లాడగలుగుతాడని తనకు ఏ పని కావాలో అడిగి చేయించుకుంటారన్నారు. ప్రస్తుతం పోటీ చేస్తున్న అభ్యర్థుల వద్దకు సామాన్య పౌరుడు వెళ్లి మాట్లాడగలుగుతాడా అని ప్రశ్నించారు. ఈ తేడాను ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ఐదేళ్లల్లో 1.18 లక్షల మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించి గ్రేటర్‌లోనే ఎక్కువ లబ్ధిదారులు ఉన్న నియోజకవర్గంగా పేరు తెచ్చుకున్నామని తెలిపారు. రాంనగర్ డివిజన్ అధ్యక్షులు మోజెస్, శివముదిరాజ్, దామోదర్ రెడ్డి, పరకాల మనోజ్, డేవిడ్, శ్రావణ్, ముచ్చకుర్తి ప్రభాకర్, రమేష్, మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముఠాగోపాల్, ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్, ఎక్కాల యాదవ్

కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

చిక్కడపల్లి: పోలింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్ నాయకులు, కార్యకర్తలకు బూత్ కమిటీ ఏజెంట్లకు సూచించారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బీఆర్‌ఎస్ ఎన్నికల కేంద్ర కార్యాలయంలో బూత్ కమిటీ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్, ఎన్నికల ఇన్‌చార్జీలు ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్, ఎక్కాల యాదవ్ వారికి సూచనలు చేశారు. ముఠాగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల రోజు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, సాయంత్రం పోలింగ్ ముగిసేంత వరకు ఉండాలని సూచించారు. ఎన్నికల తేదీ సమీపించడంతో ఇతర పార్టీలు ఫేక్ వీడియోలు, వార్తలు ప్రచారం చేసే అవకాశం ఉందని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఆరు గ్యారంటీలే గెలిపిస్తాయి

ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా అనిల్‌కుమార్ యాదవ్ ప్రచారం



బ్రహ్మంగారి దేవాలయం వద్ద ప్రచారం చేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచే మాజీ ఎంపీ, కాంగ్రెస్ ముషీరాబాద్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌కు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ముషీరాబాద్ డివిజన్‌లోని జాంబవినగర బ్రహంగారి వీధి, వినోభానగర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయన్నారు. పదేళ్లు ఎంపీగా పని చేసిన అంజన్‌కుమార్‌యాదవ్ ముషీరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశారని, మరోసారి ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముషీరాబాద్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు మంగళహారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండం శ్రీనివాస్‌యాదవ్, బి–బ్లాక కమిటి కన్వీనర్ నాగభూషణంగౌడ్, నాయకులు మురళీమోజెస్, లింగంగుప్తా, జీఎన్ చారి తదితరులు పాల్గొన్నారు.

అడిక్‌మెట్ మసీద్ వద్ద కాంగ్రెస్ నేతల ప్రచారం..

ముషీరాబాద్: ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా అడిక్‌మెట్ డివిజన్‌లోని పలు మసీద్‌ల వద్ద కాంగ్రెస్, తెలంగాణ జన సమితి నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ప్రార్థనలకు వెళ్లిన ముస్లిం సోదరులకు కరపత్రాలు అందిస్తూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మనోహర్‌సింగ్, డాక్టర్ అన్సారీ, తిరుమల్, టీజేఎస్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నర్సయ్య, మెరుగు శ్రీనివాస్‌యాదవ్, అజయ్‌గౌడ్, సుధాకర్, రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అడిక్‌మెట్ మసీద్ వద్ద ప్రచారం చేస్తున్న దృశ్యం

మాతృభాషపై పట్టు సాధించాలి




మాట్లాడుతున్న డాక్టర్ శ్రీవిద్యానంద ఆర్య

కాచిగూడ: మాతృభాషలో ప్రావీణ్యం సాధిస్తేనే ఇతర భాషలను సులువుగా ఆకలింపు చేసుకో వచ్చునని ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృత విభాగం అధిపతి డాక్టర్ శ్రీవిద్యానంద ఆర్య అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని భవన్స్ న్యూ సైన్స్ కళాశాలలో భాషా దినోత్సవ వేడుకలను ప్రిన్సిపాల్ పేరాల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషను మర్చిపోతే సంస్కృతిని మర్చిపోయినట్లే అన్నారు. భాష భావ వ్యక్తీకరణకు మాధ్యమమని భాష లేనిదే మన సంస్కృతిని భావితరాలకు అందించడం వీలు కాదన్నారు. ప్రతి ఒక్కరూ మాతృ భాషలో మాట్లాడాలని సూచించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు భాష ప్రాముఖ్యతను అర్థమయ్యే రీతిలో వివరించారు. వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25న లలితా మహాత్రిపుర సుందరి, సుబ్రహ్మణ్య ప్రతిష్ఠాపన మహోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్ర: బాగ్‌లింగంపల్లి హనుమాన్ దేవాలయంలో ఈ నెల 25 నుంచి 27 వరకు లలితా మహాత్రిపుర సుందరి, సుబ్రహ్మణ్య ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటకృష్ణారావు(బబ్లూ), ఉపాధ్యక్షులు శేఖర్, కోశాధికారి రామకృష్ణా, పురోహితుడు నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 25న ఉదయం 8 గంటలకు శాంతి వచనం, గణపతి పూజ, స్వస్తి పుణ్య వచనము, అఖండ దీపస్థాపన, 26న ఉదయం 8 గంటల నుంచి లలితా, చండీ అవనము, సుబ్రహ్మణ్య అవనము, క్షీరాధి వాన, ధాన్య దివాస, నైవేద్యం, మంగళహారతి, మంత్ర పుష్పం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 27న ఆలయ సంప్రోక్షణ, గర్భాన్యాసం, నవరత్నాన్యాసం, విగ్రహ స్థాపన, ప్రాణప్రతిష్ట, నేత్రోనిలయం, వాహన ప్రతిష్ట, శిఖర స్థాపనము, శ్రీ చక్రార్చన, బలిహరణ, పూర్ణాహుతి, మహా నైవేద్యంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహ ప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వివిల్ చారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తి (50) ఉందానగర్ – తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని ఒంటిపై బ్లూ కలర్ ఫుల్ షర్టు, యాష్ కలర్ ప్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.